


"ఉమాదేవి"




"సుందర రాజుకు—

అవును. సుందర రాజుకే. లేకపోతే నిన్ను వరుస పెట్టిగూడా పిలవాలా!... అసలు ఆ పిలుపు అంటేనే—ఆ వరస అంటేనే ఎందుకో నాకు పరమ అసహ్యం. దానికితగ్గట్టు మొన్నటి నీ ప్రవర్తన....

ఏం? కాదా—ఇప్పటికైనా మారావేమో నను కున్నాను—కాని యీ అయిదారు సంవత్సరాల నుంచీ ఒకే కాంక్ష—ఒకే వాంఛ మనసులో అలాగే వుంచుకుంటూ పెంచుకుంటూవస్తున్నా వనుకోలేక పోయాను. ఎప్పటి కప్పుడు ప్రయత్నించ బోవటం - నాచేత నాలుగు చీవాట్లూ తిని, క్షమార్పణ అడగటమూ సరిపోతూనే ఉంది.

అది నీకు పరిపాటే అయిపోయినట్టుంది.

ఏం సుందర రాజూ? నీవూ నాకంటే ఎక్కువ చదువుకున్నవాడివే కదా, కాస్త ఆలోచించు. కంచే చేనుమేస్తే యిక ఆ పొలానికి కావలి ఏముంది? తల్లే విషంపెడితే యిక ఆ పిల్లకు రక్షకులెవరు?

రక్తస్పర్శ—కేవలం మేనత్త మేనమామ పిల్లలమే! ఒక్కచోట పుట్టి ఆడుతూ పాడుతూ ఒక్కచోట పెరిగినవాళ్ళం!....అలాంటిది మీరు నాకుకూడా అన్నదమ్ములే అని భావించు కుంటూవచ్చిన నన్ను నీవే అన్యాయం చేయాలనుకుంటే యిక పరాయివాళ్ళ నెలా నమ్మాలి? అసలు చాలా విషయాల్లో పరాయివాళ్ళే నయమేమోలే. ఇంతకూ నీ వనేదేమిటి? నామీద ప్రేమ ఉందంటావు. ఉంటే ప్రయోజనమేమిటి? బుద్ధి పెడదోవలు పెట్టిం తర్వాత, అంతా మించి పోయాక-నీవేమో వివాహితుడివి. నలుగురు బిడ్డల తండ్రివికూడా—అయినా నీలో నిగ్రహశక్తి పెంపొందలేదు. చిన్నతనానే పెళ్లి అవటాన పాతికేళ్లు నిండకుండానే నలుగురు పిల్లలు పుట్టారుగాని, అంతమాత్రాన వయసుతో వచ్చేకోరికలూ ఉద్రేకాలూ ఎలా చల్లారుతాయి అంటావేమో-ఛా! ఎంతమాట!! భగవంతుడూ, నీ తల్లిదండ్రులూ రత్నంలాంటి భార్యను నీకు ప్రసాదించారు. నలుగురి దృష్టిలో అనుకూల దాంపత్యం మీది. అన్నిటా తగిపోయిన సౌందర్యవతి అయిన యిల్లాలిని యింట్లోపెట్టుకుని యిలా పరాయి స్త్రీలకోసం పాకులాడటం—విజ్ఞులు చేయాల్సిన పనేనా? ఇదే ఏ బ్రహ్మచారో చేసివుంటే, కండకావరం అనేవాళ్లు మీరు....విద్యార్థులే అయితే "కోతిమూక ఎలాంటి సాహసమైనా చేస్తారు" అనేవారు.

కాని యిలా ఉద్యోగంచేస్తూ, అటు యింట్లో లక్షణంగా భార్యతో కాపురంచేస్తూ, నలుగురు బిడ్డలకు తండ్రి అయికూడా యింట్లో ఉన్న వారివెంటే పడేవాళ్ళని లోకం గుర్తించలేదా? గుర్తించక పోదులే—పాపం, నిజం ఎంతోకాలం దాగవంటారు. ఎప్పటికైనా బైటపడక తప్పవు.

నిజంగా నీకేగనక నామీద మమతఉంటే నీ చేతిలోంచి దాటిపోయి ఉండేదాన్నేనా? నాన్న జబ్బుతో మంచంలో ఉన్నప్పుడు నీకు చేసుకోమని మీ అమ్మని ఎంత ప్రాధేయ పడ్డాడు.

అప్పుడు మీ అమ్మ ఏమందిట? "పూటకు టికాణాలేనివాళ్ళ పిల్లని నా ఏకైక పుత్రునికి ఎలా చేసుకోమంటావు?" అని మొరటుగా జవాబిచ్చిందిట—నిజానికి మే మంతగా లేని వాళ్ళమా? అమ్మ చెపుతోంటే విన్నాను. ఇంట్లో లేకపోయినా అప్పులుచేసి అయినా తోడ బుట్టిన వాళ్ళ ముచ్చటలు తీర్చే వాడట నాన్న! మీ అమ్మపెళ్ళికి కట్నానికి మూడువేలు కావలసివస్తే—అన్నగారు నసే మిరా నే నివ్వను మరో అథమస్తపు సంబంధమే చేద్దామంటే కూడా కాదని—తనవాటా అమ్మి మరీ కట్నంయిచ్చి మీ నాన్నకిచ్చి పెళ్ళిచేశాట్ట! అందుకేగా మాకు ఏ ఆధారం లేకుండా పోయింది—రెక్కల నమ్ముకుంటే ఆ ఉద్యోగమూ రోగం రాకతో ఊడిపోయి ఆఖరుకు తిండికికూడా మిగలకుండా అన్నీ అమ్ముకోవలసి వచ్చింది. ఆఖరు రోజుల్లో ఆయనకోర్కె తీర్చలేకుండా పోయింది, ధన గర్వంతో నీ తల్లి—ఆ మాత్రం కృతజ్ఞతను గూడా చూపలేక పోయింది. మేము యీస్థితికి రావటానికి కారణం ఎవరో?—అయినా ధనం బాంధవ్యాన్ని లెక్క చేయనీయదేమో.

ఐతే నీవు అప్పుడు నేను చిన్నవాణ్ణి కదా అంటావు—కావచ్చు. ఐనా ప్రస్తుతం వివాహితుడివే కదా-యింకా నామీద ఆశలు పెట్టుకోవలసిన అగత్యం నీకేముంది? ఈ మగాళ్ల మనస్తత్వం నాకో అందాన అంతుపట్టదు—రత్నంలాంటి భార్యను యింట్లో పెట్టుకునే సామాన్యమైన పరాయి స్త్రీలకోసం యెందుకు ప్రాకులాడుతారో-ఇంకొంచెం పెద్దదాన్నయాక తెలుస్తుందేమోలే.

"నీవు పరాయిదానవెలా అవుతావు?" అంటున్నావా. ఏం-కాక? (ఇదో జబ్బు-మరదలనగానే భార్యతో సమానమయినట్లను కొంటారు కొందరు. అది మిమ్మల్నన వలసిన పనిలేదు - చిన్నప్పటినించీ మన పెద్దలే మొగుడూ-పెళ్ళాం అని పేర్లుపెట్టి పిలుస్తూ అలవాటు చేస్తారు-యీ దౌర్భాగ్యపు అలవాట్లు పోయిందాకా మన జాతికి పురోగమనం అంటూ లేదు) నిజానికి మీ కుటుంబం మాకు చేసిన ద్రోహానికి మే మసలు మీతో తిరిగి మాట్లాడవలసిందే కాదు. కాని పంతాలతో విరోధాలు పెంచుకుని కక్షలుకట్టి సాధించే స్థితిలో లేము. అదీ చిక్కు.

పోనీగాని సుందర రాజూ—ఒకవేళ నీ భార్యనే యిలా వాళ్ల బావ లెవరైనా ఏదైనా చేయబోయారనుకో-అది తెలిస్తే నీకెలా ఉంటుంది. నాకు తెలుసు-నీభార్య పవిత్రత పోవటం నీకు యిష్టం ఉండదు. అలాగే యితరులకీ అనుకోరాదూ? నా భర్తమటుకూ నేను పవిత్రంగా ఉండాలని వాంచించడూ? నాకు వివాహం కానంత మాత్రాన ఏమయింది? నా పవిత్రతని కాపాడుకోటం నా హక్కు-విద్యుక్త ధర్మం. పెళ్లయినవాళ్ల జోలికిపోతే వారిభర్తలు చూస్తే ఏం చేస్తారోనన్న భయంతోనైనా ఎవరూ సమీపించరేమో-కాని అవివాహితలం మేము, మాకోసం మా నైతికబలంకోసం, ఆత్మవిశ్వాసంకోసం మా పవిత్రతను నిలుపుకోటానికి అన్ని ప్రయత్నాలూ చేస్తాము—మరి మాకు మేమే రక్షణ-నీకు ప్రమీల ఎంతో నేనూ అంతే కదా - లేకపోతే ఆమె మీ అమ్మకు అప్ప కూతురు. నేను అన్న కూతుర్ని. దాన్నీ ఇలాగే చూస్తావా? అది నిన్నెలా ఆపేక్షగా చూస్తోందో నేనూ అదే దృష్టితో చూస్తున్నానే. మరి నా విషయంలో యింత ద్రోహం ఎలా తలపెట్టావు?

అమాయికంగా మారుమూల ప్రదేశంలో బ్రతుకుతూ ఉన్న నేనే దొరికానా నీ పశుత్వానికి బలి అవటానికి? తెల్లవారి లేస్తే చావు బ్రతుకుల మధ్య కొట్టుకులాడుతున్న మనుష్యులలో మెసలటమేగదా నీ వృత్తి-నీ చేత్తో ఎన్నో శవాలని స్త్రీ పురుష భేదం లేకుండా చదువుకొనే రోజుల్లో కోసి ఉంటావు. నీ పరిస్థితిలోనే గనక నే నుంటే సన్యాసం పుచ్చుకొనేదాన్నే యీపాటికి—అలాంటిది వైరాగ్యభావాలు ఉదయించటం పోయి అనుక్షణం లౌకిక వాంఛలు అభివృద్ధి ఐపోతున్నట్లున్నాయి నీకు! చాలా బాగుంది.

ఇదంతా ధనమదమే అనుకోవచ్చా నేను? రాకరాక వచ్చావు, రక్తస్పర్శ గదా-అన్న

లాటివాడివి—అనుకుని మర్యాద చేశాను. ఒక పూట ఉండివెళ్ళు అన్నాను—అసుర సంధ్య వేళ వచ్చావు, ఇంతరాత్రి వెళ్ళకపోతేయేం, భోజనంచేసి వెళ్లువుగానిలే అన్నాను. లోకమో పాడో అని మర్యాదచేశా గాని యిదంతా నీమీద నేనుచూపే మరొక రకమైన ప్రేమ అని నీవు అపార్థం చేసుకుపోతావని నాకేం తెలుసు! అలాగే నాకు చేతైనట్లు వంటచేసి ఒక బంధువుకుచేసే మర్యాదలన్నీ చేసి కొసరి కొసరి వడ్డించి దగ్గరకూర్చుని భోజనం పెట్టాను—అదే నీవు మరోలా తీసుకున్నావు కాబోలు!

నా భోజనమూ అయిన తరువాత కాసేపు ఆ కబుర్లూ యీ కబుర్లూ చెప్పి వంటగదిలో నా పక్క వేసుకుని, ముందుగదిలో నీకు పక్క వేద్దాంకదా అని వచ్చాను....ఇంతలోనే నీకు యీ దుర్బుద్ధి పుడుతుందని నే నేమాత్రం అనుమానించినా రాకే పోయేదాన్ని! పక్క దులిపి వేస్తోండగా వెనుకనుంచి నన్ను బలంగా ఎవరో పట్టుకున్నట్లయి ఒక్కసారి ఉలిక్కి పడ్డాను. అప్పటికి అర్థమయింది—నిజంగా ఎంతటి సాహసానికి—ద్రోహానికి ఒడిగట్టావు!! నీపట్టు వదిలించుకోటానికి నేను చేసే ప్రయత్నంలో నా గాజులు చేసిన శబ్దం—అసలే రెండు చేతుల నిండా గాజులు వేసుకున్నా నయ్యో, కన్నె పిల్లని' అర్ధరాత్రి గాజుల చప్పుళ్ళలోని అంతరార్థం ఏంతెలుసూ! అయితే యిరుగు పొరుగులు ఆరితేరిన వారేగా, యీ చప్పుడు వాళ్లకు అర్థంకాదూ-ఆ విషయం తలపుకి వచ్చి సిగ్గుతో బాధతో ఎంత కృంగిపోయానో నీకేం అర్థమవుతుంది? వంటరి ఆడది పరాయి చోట ఉద్యోగ రీత్యా ఉంటున్నా ఎన్ని కళ్లు ఆమెని వెంటాడుతుంటాయో - ఎంత మంది ఆమెలో ఏ మాత్రం లోపం కనిపించినా బట్ట బయలు చేసి అల్లరి పెట్టాలని కాచుక్కూచుంటారో,మగమహారాజువి నీ కేం తెలుస్తుంది? అందులో సంస్కారం లేని వ్యక్తులతో కూడిన వాతావరణం — యింటికి బంధువు వస్తే ఎలాంటి చుట్టమో అని, వచ్చిన వ్యక్తి వెళ్ళిందాకా వారి తాలూకు ప్రతి కదలికా పరిశీలించే యిరుగు పొరుగులూ-చదువుకున్న స్త్రీల సౌశీల్యాలను అనుక్షణమూ శంకించే మనఃప్రవృత్తులు - యిలాటి చోట ఉన్న నేను యీ మాత్రం గౌరవంగా బ్రతకటం నీకు ఇష్టం లేదల్లే ఉందిలే. పైగా చేసేది సోషల్ వర్క్; మాలోనే లోపాలుంటే యితరుల నెలా సమీపించి సలహా లీయగలము? తెల్లవారిలేస్తే ఊరూరా కేంపులు తిరుగుతూ మీటింగులు ఏర్పాటు చేసుకుంటూ ఉండాలే! ఏమాత్రం లోపం కనిపించినా యిక గుడ్డిగవ్వపాటి విలువయినా ఉంటుందా?

కాకపోతే నీవు తలపెట్టిందేమిటి? ఇదే మరొకరైతే అరిచి కేకలు పెట్టచ్చు - కాని నలుగురూ చేరితే ఏమవుతుంది? నీకు అవమానం జరిగే మాటటుంచి ఆ అవమానం ముందు నాకు! నీ చుట్టమే ‹కదుటమ్మా అని నలుగురూ నన్నే అంటారు. ఎంత అలుసిచ్చిందో లేకపోతే యిలా ఎందుకు చేస్తాడు అంటారు - పాపం పుణ్యం భగవంతునికే తెలుసనుకో. కాని మరొక డెవడైనా అయితే అసలు గుండెలుంటాయా వాడికి యీ ప్రాంతానికి రావటానికి? చుట్టానివి కాబట్టే బంధుప్రేమలోపడి వెర్రిదాననయి ఆదరించాను.

కాని యీ పెనుగులాట రభస ప్రక్కగదిలో ఉన్న పొరుగుదంపతులు విని ఏమనుకుంటారు? ఇదేదో యిచ్ఛాపూర్వకంగా జరిగే తతంగమే అనుకోరూ! పెద్దగా చెపుదామా వీల్లేదయ్యో - మెల్లిగా చెబుదామా, రహస్య సంభాషణలకి నా గొంతు అలవాటు పడలేదయ్యో! మరెలా సాధ్యం? ఆ క్షణంలో నీ గొంతు పిసికి పారేయాలనిపించింది - కాని నీ పట్టు వదిలించుకునేందుకే నా బలం చాలటం లేదాయె కర్మ! నలుగురిలో నా పరువు పోతుందని సైగ చేద్దామంటే అవి గమనించే పరిస్థితిలో నీవు ఉంటేగా!

మానవుల్లో పశుత్వం అంటూ పుస్తకాల్లో చదవి అవి నమ్మచ్చా లేదా అని తర్కించుకుంటూ ఉండేవాళ్ళం - అది అక్షరాలా ప్రత్యక్షంగా చూచాను ఆ రోజు. ఎలాగో ఆత్మ విశ్వాసంతో పెనగులాడి ఒక్క ఉదుటున తప్పించుకుని బైటకువచ్చి గడియ వేయగలి

గాను. ప్రపంచంలో కొన్ని రకాల సుఖాలకు పూర్తిగా దూరంగా ఉన్న కన్యలోని నిద్రాణ వాంఛలు రేకెత్తింప జేయాలనే నీ ప్రయత్నం ఎంత దారుణం! అమానుషం! ఇదే చూస్తే చదువుకున్న వాళ్ళంతా యింతేననే నిశ్చయానికి, మూర్ఛలు రావటానికి ఎంతసేపు పడుతుంది? ఇక కిటికీ దగ్గర చేరి నీవు చేసిన గోల అంతా యింతా కాదుగదా అర్ధరాత్రి గుసగుసలు వింటే అంతా ఏమనుకుంటారు? పెద్దగా అరిచి తిడదామా - యింకా అప్రతిష్ఠ ఊరుకుందామా—అబ్బ! అప్పటి నీ చూపులు—నీ అభినయం—నీ ముఖాకృతి—చీ చీ—యిలాంటి వాడివి నా బంధువువని చెప్పకోటానికి గూడా నామర్దాయే (అర్ధరాత్రి బంధువునయినా వంటరిగా ఉండే సమయంలో అతిథిగా ఉంచుకోరాదనే పాఠం నేర్చుకున్నానులే)

బలహీనత దోషమనను నేను—కాని నిన్ను నీవు అదుపులో పెట్టుకో లేకపోవటం యితరులపై అత్యాచారానికి పూనుకోటం—క్షంతవ్యం కాని మహాపరాధం—ఒక్కసారి లొంగటమూ పదిసార్లు లొంగటమూ వేరా? అయినా దాని ఫలితాలేవిటో తెలియని అజ్ఞానివా? లేక ఫలితమేదయినా అన్నీ నా చేతిలోనే ఉన్నాయికదా అనే అహంకారమా? అయినా నీకు లొంగవలసిన అవసరం నాకేముంది? భగవంతుని దయవల్ల నేను చాలా నేర్పుగా కొద్దిలో తప్పించుకున్నాను లేకపోతే ఆ మరణాంతం నీ జీవానికి పడి ఏడుస్తూ ఉండవలసి వచ్చేది! ఏదైనా అయితే నిలవేసి పెళ్ళాడేందుకూ లేదు—బహుభార్యా నిషేధంమాట మర్చిపోయావా?

పైగా నా రజనిని హేళన చేయటానికి ప్రయత్నిస్తావా! నీలాటివాళ్లు వెయ్యిమంది అయినా అతని కాలిగోరికి గూడా పోలరని తెలియదు కాబోలు నీకు అతని నిగ్రహం, ఔన్నత్యం నీలో ఏవీ? పెళ్ళి చేసుకోబోతున్నామనే దృఢమైన నమ్మకం ఉండీ—ఒకర్ని విడిచి ఒకరం ఉండలేని స్థితిలో ఉండీ కూడా-నీలా అత్యాచారాలు అతడు ఏనాడూ తలపెట్టలేదు అందుకే అతనిమీద నాకు గౌరవభావం మరింతగా యినుమడించింది ఒక్కోరోజు అలా కబుర్లు చెప్పకుంటూ తెల్లవారిందాకా ఒక్కచోట కూర్చుని గడిపేవాళ్ళం. అయినా అతడా ఏకాంతాన్ని అవకతవగ్గా ఉపయోగించుకోటానికి ఎన్నడూ ప్రయత్నించలేదు...

అందుకే మీరనుకున్న ఫలితాలు లేకపోతే. అతన్ని మరోలా శంకించారు—'తానెంతో జగమంత' అనే తత్వంగల మీ సంకుచిత బుద్ధి అంతవరకే పరిమితమయిందిలే మీ మూర్ఖత్వానికి, మొరటుతనానికి నాలో నేనే నవ్వుకున్నాను "నీవు మరో పదేళ్ళాగినా అతడు నిన్నెలాగూ చేసుకోడు. చక్కగా మోసం చేశాడు" అన్నావు కదూ—అవును కామెర్ల వాళ్ళకి అన్నీ పచ్చగానే కనిపిస్తాయి మరి. అపారమైన ప్రేమ, గౌరవం నామీద కలిగిన వ్యక్తిని మోసగాడనక మరేమంటారు మీరు—కాని నా మనసుకు నాకు తెలీదూ? ఎటువంటి అవాంతరం వచ్చినా రజని అన్న మాట తప్పడు అందువల్లనే యీ నిరీక్షణ—యీ తపస్సు!

కాకపోయినా నిర్మలమైన ప్రేమలోఉండే మాధుర్యం భార్యకు ద్రోహంచేసి పరస్త్రీలను కామించే నీకెలా అర్థమవుతుంది? ఎప్పటికైనా రజని నావాడు—యీ నిరీక్షణలో మరణమే వస్తే—అవశ్యం, అలాగే ఎదుర్కొంటాను. లేదూ, నీవన్నట్లు ద్రోహమే చేశాడా-పోనీ అంతేగాని నీలాంటి వాళ్ళకు, క్షణిక సుఖాలకు ఆశించి లొంగిపోతానని కల్లోకూడా అనుకోవద్దు, ఆఖరుసారిగా చెపుతున్నాను ఇక ఎన్నటికీ యీ ప్రాంతాలకు రాబోకు నాయెడల నీ అభిప్రాయం పూర్తిగామారి నీపై నీకు సంయమనం వచ్చిందనుకున్నదాకా నా కంటికి కూడా కనిపించకు నీవు అదే పనిగా క్షమాభిక్ష కోరుతూ జాబులు వ్రాస్తోంటే, నాకు చిరాగ్గా ఉంది నీదగ్గరనుంచి ఎలాటి జాబూ నాకు రానక్కరలేదు దీనికి జవాబుకూడా వ్రాయనవసరం లేదు

నీలో యికనైనా మార్పు వస్తుందని ఆశించే వ్యక్తి—

వజ్రభాషిణి" ★